

AKSHARA TODAY
అక్షర చుట్టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

ముందుకు సాగని అభివృద్ధి పనులు



2



2

డ్రైవర్‌కు ఫిట్స్.. చెట్టును ఢీకొన్న బస్సు..

31న దిశ సమావేశం



అక్షరటుడే, ఇందూరు: కలెక్టరేట్‌లో ఈనెల 31న శనివారం ఉదయం 10.30కు ఎంపీ అర్వింద్ అధ్యక్షతన దిశ సమావేశం జరుగనుంది. ఈ మేరకు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయన్న ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులచే వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో విచ్చేయాలని కోరారు.



తెయూలో ఖాళీ సీట్లను భర్తీ చేయాలి

అక్షరటుడే, తెయూ క్యాంపస్: తెలంగాణ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న 125 పీజీ, ఎల్ఎల్బీ సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యెండల ప్రదీప్ కోరారు. ఈ మేరకు తెయూ ప్రిన్సిపల్ రాంబాబుకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. యూనివర్సిటీలో ప్రతి ఏడాది కొన్ని కోర్సుల్లో సీట్లు మిగిలినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలని, ఏటా సీట్లు మిగిలితే స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సందీప్, ప్రశాంత్, భాస్కర్, కృష్ణ ప్రసాద్, సందీప్ రెడ్డి పాల్గొన్నారు.



కృత్రిమ మేధస్సుతో విప్లవాత్మకమైన మార్పులు : తెయూ వీసీ

అక్షరటుడే, తెయూ క్యాంపస్: కృత్రిమ మేధస్సు తో సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని తెయూ వీసీ యాదగిరి రావు పేర్కొన్నారు. ఈ మేరకు తెయూ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ రచించిన పుస్తకాలను రిజిస్ట్రార్ యాదగిరితో కలిసి ఆవిష్కరించారు. 'బియాండ్ ది బైలైన్స్ హౌ ద జర్నలిస్ట్ అండ్ ఏఐ షేప్ ది న్యూస్ ' అలాగే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ పబ్లిక్ రిలేషన్స్' అనే రెండు పుస్తకాలను ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ రాశారు. వీసీ యాదగిరి రావు మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, జర్నలిజం, ప్రజా సంబంధాల రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. జర్నలిజం, ప్రజా సంబంధాల రంగాల్లో కృత్రిమ మేధస్సు విని యోగంపై అవగాహన పెంపొందించడంలో ఈ పుస్తకాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

కామారెడ్డి జిల్లాలో చిరుతపులి సంచారం ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. నాగిరెడ్డిపేట్, లింగంపేట్, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, గాంధారి తదితర మండలాల పరిధిలో చిరుత కదలికలు కలకలం రేపుతున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో పొలాలకు నూర్పిడి నిమిత్తం వెళ్లాల్సి ఉండగా రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

– అక్షరటుడే, ఎల్లారెడ్డి



భయం గుప్పిట్లో పల్లెలు..

- నెల రోజులుగా పలు మండలాల్లో కదలికలు
- భయాందోళనలో రైతులు, గ్రామస్తులు
- గుట్టలు, పంట పొలాల్లో సంచారం!
- చెన్నకేశ్వర స్వామి గుట్టపై చిరుత ప్రత్యక్షం
- రాత్రి వేళ బయటకు వెళ్లొద్దన్న అధికారులు

హసన్‌పల్లి, వెంకంపల్లి, మాల్ తుమ్మెద, ఎక్కపల్లి, పరమలతండా, మెంగారం అటవీ ప్రాంతాల్లో చిరుత సంచరిస్తుండడంతో గ్రామస్తులు, రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. తాజాగా నాగిరెడ్డిపేట్ మండలం మాల్తుమ్మెద గ్రామ సమీపంలోని చెన్నకేశ్వర స్వామి గుట్టపై చిరుత కనిపించడంతో స్థానికుల్లో ఆందోళన మరింత పెరిగింది.

చెన్నకేశ్వర స్వామి గుట్టపై ప్రత్యక్షం

మాల్తుమ్మెద గ్రామ సమీపంలోని చెన్నకేశ్వర స్వామి గుట్టపై చిరుత సంచరిస్తుండటాన్ని రైతులు గుర్తించారు. వెంటనే గ్రామ సర్పంచ్ సాయిలుతో పాటు ఇతర గ్రామస్తులకు సమాచారం అందించారు. అనంతరం అటవీశాఖ అధికారులు, పోలీసులకు సమాచారం చేరవేశారు. గుట్ట దిగువన రైతులు వరి ధాన్యం నూర్పిడి పనులు చేస్తున్న సమయంలో ఆలయ గర్భగుడి సమీపంలో మెట్ల పక్కన చిరుత కనిపించినట్లు తెలిసింది. చిరుత చుట్టూ గద్దలు గుమిగూడి తిరుగుతుండటాన్ని గమనించిన రైతులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న వీఆర్వో రాఘవేందర్, పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని అక్కడ ఉన్న గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు పంపించారు. సుమారు రెండు గంటల పాటు చిరుత కదలికలను గమనించినట్లు సమాచారం. సాయంత్రం 5 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు ఒంటరిగా బయటకు వెళ్లవద్దని, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గుంపులుగా వెళ్లాలని అధికారులు సూచించారు.

పంట పొలాలకు వెళ్లాలంటేనే భయం

ప్రస్తుతం వరి కోతలు, ధాన్యం నూర్పిడి పనులు జరుగుతున్న నేపథ్యంలో చిరుత సంచారం రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వ్యవసాయ పనుల కోసం తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో పొలాలకు వెళ్లాల్సి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ఎదురవుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల వద్ద పనులు చేసేందుకు కూడా జంకుతున్నామని పలువురు చెబుతున్నారు. పశువులు, మేకల భద్రతపై కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చర్యల్లేవంటూ ఆగ్రహం

నాగిరెడ్డిపేట్ మండల పరిధిలో సుమారు నెల రోజులుగా చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల మెదక్-ఎల్లారెడ్డి జాతీయ రహదారిని దాటి వచ్చినట్లు భావిస్తున్న చిరుత మొదట వెంకంపల్లి గుట్టపై కనిపించగా, తాజాగా మాల్తుమ్మెద గ్రామ సమీపంలోని చెన్నకేశ్వర స్వామి గుట్టపై ప్రత్యక్షమైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో చిరుత కదలికలు కనిపిస్తున్నప్పటికీ దానిని పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతుల తర్వాతే బోను ఏర్పాటు

చిరుతను బంధించేందుకు జిల్లా అధికారి నుంచి ముందస్తు అనుమతులు తీసుకున్న తర్వాత బోను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఎఫ్ఆర్వో వాసుదేవ్ తెలిపారు. చిరుతలు సాధారణంగా విస్తృత పరిధిలో సంచరిస్తాయని పేర్కొంటూ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

అక్షరటుడే, కామారెడ్డి: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. గురువారం ఆయన భిక్కనూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారు నిర్వహిస్తున్న విధులు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో నేరాల తీరు, అనుమానిత వ్యక్తులు, రౌడీషీటర్ల వివరాలు, వారి కదలికలపై సిబ్బందిని ఆరా తీశారు. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్లోని కేసు ఫైళ్లు, వివిధ రికార్డుల నిర్వహణను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. రోల్ కాల్‌ను పరిశీలించి టెలికాన్ ఫ్రెండ్స్ ద్వారా సిబ్బందికి అందుతున్న సమాచారం సక్రమంగా చేరుతుందా లేదా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితుల సమస్యలను ఓపికగా విని చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులను సమీక్షించి దర్యాప్తులో జాప్యం జరగకుండా సాక్ష్యాధారాలను సేకరించాలని తెలిపారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ కేసుల దర్యాప్తును పకడ్బందీగా పూర్తి చేసి నిర్ణీత గడువులో చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. రాత్రి వేళల్లో గస్తీని పటిష్టం చేసి దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, సైబర్ నేరాలు, ఆన్ లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



రక్తదానం చేసి బాధితుల జీవితాల్లో వెలుగులు నింపాలి : సీపీ సాయిచైతన్య



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: అత్యవసర పరిస్థితుల్లో ఉన్నప్పుడు రక్తదానం చేసి బాధితుల జీవితాల్లో వెలుగులు నింపాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. పోలీసు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో పలువురు పోలీసులు, కళాశాలల విద్యార్థులు, యువకులు రక్తదానం చేశారు. వారిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు. రక్తదానం మహాదానమని.. విలువైన ప్రాణాలు కాపాడే లైఫ్‌లైన్ అని ఆయన పేర్కొన్నారు. ఏసీపీ ప్రకాశ్, రూరల్ సీఐ శ్రీధర్, ఉమెన్ పీఎస్ సీఐ ప్రసాద్, నాల్గో టౌన్ సీఐ సతీష్‌తో సహా సుమారు 200 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ డాక్టర్ సీనునాయక్, కోశాధికారి కెంపుల నాగరాజు కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు : సుదర్శన్‌రెడ్డి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఎల్‌నినో ప్రభావంతో విపత్కర పరిస్థితులు నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో జిల్లాలో తాగునీటికి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర అధికారులతో కలిసి సమావేశమయ్యారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధాన తాగునీటి వనరులుగా ఉపయోగపడుతున్న నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను పూర్తిగా తాగునీటి అవసరాల కోసమే వినియోగించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగిలో తక్కువ నీటి అవసరం ఉండే కూరగాయలు, పప్పు దినుసులు వంటి పంటలు విత్తుకోవాలని కోరారు. మాధవనగర్, అర్సపల్లి ప్రాంతాల్లో కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. మాధవనగర్ ఆర్వోబీ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 13 విడతల్లో రూ.42కోట్ల నిధులు కేటాయించిందన్నారు. అర్సపల్లి



ఆర్వోబీకి కూడా రూ.11కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. అయినప్పటికీ కొంత మంది నాయకులు అవగాహన లేకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి పాల్గొన్నారు.

కామారెడ్డిలో ప్రజలకు మరింత చేరువగా ఆధార్ సేవలు

అక్షరటుడే, కామారెడ్డి : నూతనంగా ఏర్పాటైన ఆధార్ కేంద్రంతో ప్రజలకు ఆధార్ సేవలు మరింత చేరువ కానున్నాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. జిల్లా కేంద్రంలో నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటైన ఆధార్ కేంద్రం హైదరాబాద్ లోని ప్రాంతీయ కార్యాలయానికి అనుబంధంగా పనిచేస్తుందని, ప్రజలకు ఆధార్ నమోదు, వివరాల సవరణతో పాటు ఇతర ఆధార్ సంబంధిత సేవలను సులభంగా అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. తెలంగాణలో 14 జిల్లాల్లో ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా కామారెడ్డి జిల్లాలో ఈ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న 14 జిల్లాల్లో కామారెడ్డి 12వ జిల్లాగా నిలిచిందని తెలిపారు. సాధారణ ఆధార్ కేంద్రాలతో పోలిస్తే ఈ కేంద్రంలో మరిన్ని ప్రత్యేక సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఆధార్‌కు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం, నిలిపివేయబడిన ఆధార్ నంబర్లకు సంబంధించిన సమస్యల పరిష్కార ప్రక్రియ వంటి సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని



వివరించారు. గతంలో ఆధార్ కు సంబంధించిన కొన్ని ప్రత్యేక సేవల కోసం హైదరాబాద్ కు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం జిల్లా కేంద్రంలోనే ఈ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి, ఎంపీడీవో హెబ్సీబా రాణి, ఈడియం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటమి నుంచి పాఠం నేర్చుకోవాలి : ఎమ్మెల్యే భూపతిరెడ్డి



అక్షరటుడే, డిచ్‌పల్లి: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని చూసి నిరుత్సాహపడకుండా కొత్త పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగాలని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి అన్నారు. ఖిల్లా డిచ్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. గ్రామీణ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం గ్రామీణప్రాంతాల్లో ఎంతో ప్రతిభ, నైపుణ్యం కలిగిన విద్యార్థులు ఉన్నారని, వారిలోని సామర్థ్యాలను వెలికితీసి తగిన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్‌తో పాటు వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తోందన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు పాఠశాల స్థాయి నుంచే క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ఈ దిశగా ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కోరారు. డిచ్‌పల్లి మండలానికి రూ.2.5 కోట్లతో ఎస్టీ బాలుర వసతి గృహం మంజూరైందని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మానవతా సదన్‌లోని పిల్లల సంక్షేమం, విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రూ.8.5 కోట్లతో వసతి గృహం మంజూరైందని వెల్లడించారు. సర్పంచ్ యాదగిరి, ప్రధాన ఉపాధ్యాయుడు సీతయ్య, ముప్ప గంగారెడ్డి, అమృతాపూర్ గంగాధర్, తారాచంద్ నాయక్, పొలాసని శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళితులు వర్సెస్ వీడీసీ..



అక్షరటుడే, కామారెడ్డి: రామారెడ్డి మండలం ఉప్పలవాయి గ్రామంలో ఆలయాలను ఒకేచోట నిర్మించాలని చేసిన తీర్మానాన్ని వీడీసీ పెద్దలు విస్మరించి దళితులపై కులవివక్ష చూపుతున్నారని మాల సామాజిక వర్గం ఆరోపిస్తోంది. బుధవారం జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన దళితులు గురువారం మరోసారి పోలీసులను కలిశారు. 2023లో గ్రామంలో ఏ పండుగైనా, పెళ్లి అయినా ఒకేచోట ఆలయాలు ఉంటే ప్రజలందరికీ దూరభారం తగ్గుతుందని 8 ఆలయాలను ఒకేచోట నిర్మించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. అయితే కొత్తగా ఎన్నికైన వీడీసీ సభ్యుల్లో కొందరు దళితులకు సంబంధించిన మాల పోచమ్మ ఆలయాన్ని మిగతా ఆలయాలతో పాటు నిర్మిస్తే గ్రామానికి అరిష్టమంటూ కొత్త రాగం ఎత్తుకున్నారని ఆరోపించారు. కొందరు గ్రామస్తులకు మద్యం ఎరగా చూపి దళితులకు వ్యతిరేకంగా మాట్లాడేలా చేస్తున్నారని ఆరోపించారు. తమ ఆలయాలకు దూరంగానే దళితులకు సంబంధించిన ఆలయం ఉండాలని చెప్పడం వివక్ష చూపడమేనన్నారు.

చైర్మన్ భర్త పెత్తనాన్ని సహించేది లేదు



అక్షరటుడే, కామారెడ్డి : కామారెడ్డి బల్దియాలో నెలకొన్న సమస్యలతో పాటు ఇటీవల జరుగుతున్న పరిణామాలపై వైస్ చైర్మన్ కాసర్ల గోదావరి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. పట్టణంలో సమస్యలు తీవ్రంగా ఉన్నా రెండు నెలలుగా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయడం లేదని మండిపడ్డారు. వార్డుల్లో గుంతల పూడిక కోసం మూడు నెలల క్రితమే కలెక్టర్ రూ.28 లక్షలు మంజూరు చేసినా పనులు చేయలేదని, ఆ డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించారు. నూతన పాలకవర్గం ఏర్పడి 7 నెలలు అవుతున్నా 49 వార్డుల్లో కనీసం రూ.50 వేల పనులు కూడా జరగలేదన్నారు. బల్దియాలో జనరల్ ఫండ్ ఉందని, గతంలో ఉన్న కాంట్రాక్టర్ల వద్ద 10 నుంచి 15 శాతం కమిషన్ తీసుకుని చైర్మన్ భర్త కలెక్షన్ చేస్తున్నారని ఆరోపించారు. గ్రూపులను ప్రోత్సహిస్తున్నారని, ఎన్నిసార్లు చెప్పినా వైఖరి మార్చుకోవడం లేదన్నారు. మున్సిపాలిటీని చైర్మన్ భర్తకు దాసోహం చేశారని మండిపడ్డారు. ఆయన పెత్తనాన్ని సహించమన్నారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి గిరిజనుల వినతులు



గాంధారి, కామారెడ్డి : గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ హామీ ఇచ్చారు. గురువారం గాంధారి మండల కేంద్రంలో పర్యటించిన ఆయన, వివిధ గ్రామాల గిరిజనులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలపై ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, గిరిజనులు పాల్గొన్నారు.



ఇందూరులో అభివృద్ధి..

ఎక్కడ వేసిన గొంగలి అక్కడే..

నగరంలో అభివృద్ధి పనులు ఏళ్లుగా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన పలు పనులు ఇప్పటికీ అలాగే ఉండిపోయాయి. పాత కలెక్టరేట్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న కళాభారతి పనులు కొన్నినెలలుగా నిలిచిపోయాయి. అలాగే బోధన్ బస్టాండ్, ఖలీల్‌వాడిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణ పనులు నిలిచిపోగా.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. పాలకులు ఇప్పటికైనా స్పందించి ఈ నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్



పాత కలెక్టరేట్ వద్ద మధ్యలోనే నిలిచిపోయిన కళాభారతి నిర్మాణం..





ఖలీల్‌వాడిలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం..





అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

అక్షరటుడే,ఆర్మూర్: పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఆర్మూర్ డీసీపీ శుభం ప్రకాష్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని ఆర్మూరు పట్టణంలోని ఎంఆర్ గార్డెన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రజల రక్షణ, శాంతిభద్రల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీసులకు సేవలను కొనియాడారు. అంతకుముందు పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి, ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఎమ్మార్పీఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మైలారం బాలు, అంకాపూర్ సర్పంచ్ దేవేందర్ రెడ్డి, గోనె రఘు, శాలా ప్రసాద్, రమేష్, వివేకానంద్ తదితరులు పాల్గొన్నారు.



గుజరాత్‌కు బయలుదేరిన ఇందూరు వాసులు

అక్షరటుడే, ఆర్మూర్: ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకొని ఈనెల 31ల గుజరాత్‌లోని నర్మదా కేవడియాలో 'రాష్ట్రీయ ఏకతా దివస్ భారత్ పర్వ్' వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు నిజామాబాద్ జిల్లా నుండి 30 మంది సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి గురువారం గుజరాత్ బయలుదేరారు. ఈ కార్యక్రమంలో జెస్సు అనిల్ కుమార్, నరేష్ చారి, ఆరేపల్లి నర్సయ్య, రవీందర్, శ్రీకాంత్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్‌కు ఫిట్స్.. చెట్టును ఢీకొన్న బస్సు..

అక్షరటుడే, కామారెడ్డి: బస్సు నడుపుతున్న డ్రైవర్‌కు ఒక్కసారిగా ఫిట్స్ వచ్చింది. బస్సు కంట్రోల్ కాకపోవడంతో రోడ్డు పక్కన చెట్టును ఢీకొంది. ఈ ఘటన అడ్లూర్ శివారులోని టీఎంఆర్ ఫంక్షన్ హాలు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కామారెడ్డి నుంచి మద్దికుంట గ్రామానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు టీఎంఆర్ ఫంక్షన్ హాలు సమీపంలోకి రాగానే డ్రైవర్‌కు ఫిట్స్ వచ్చింది. దీంతో బస్సు అటూఇటూ కదలడం మొదలుపెట్టింది. దాంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలోనే బస్సు రోడ్డుపక్కన ఉన్న ఓ చెట్టును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న కొందరు ప్రయాణికులకు స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని అంబులెన్సులలో గాయపడిన ప్రయాణికులను జీజీహెచ్‌కు తరలించి చికిత్స



అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో మెరిట్ స్కాలర్‌షిప్స్

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ : ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు శ్రీరామ్ ఫైనాన్స్ నిజామాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో స్కాలర్ షిప్స్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నగరంలోని దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలో సుమారు 800మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేస్తున్నట్లు శ్రీరామ్ ఫైనాన్స్ రీజినల్ హెడ్ వినయ్ కుమార్ తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్లు



జగదీష్, మన్మథ, షఫీ ఖాన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



బోనమెత్తిన ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు

అక్షరటుడే, కామారెడ్డి: ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమ్మె నిరవధికంగా కొనసాగుతూనే ఉంది. గురువారం 17వ రోజు ఉద్యోగులు బోనమెత్తి నిరసన తెలిపారు. తమ హక్కులను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుకుంటూ మహిళా ఉద్యోగులు బోనాలెత్తుకొని సమ్మె శిబిరం నుంచి అడ్లూర్ రోడ్డులోని మైసమ్మ గుడి వరకు ర్యాలీగా నినాదాలు చేస్తూ వెళ్లారు. క్రమబద్ధీకరణ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించేలా ప్రభుత్వం కృషి చేయాలని అమ్మవారిని వేడుకున్నారు. సమ్మె శిబిరాన్ని తెలంగాణ రక్షణ సేన దళిత విభాగం అధ్యక్షుడు బొరిగే సంజీవ్ సందర్శించారు. తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ముఖ్యమంత్రి త్వరితగతిన జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలని, జాప్యం చేయకుండా పల్లెల్లో, పట్టణాల్లో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా సిబ్బంది విధుల్లో ఉండేలా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి పద్మజ, నాయకులు డా.హరీష్, వెంకట రమణ, డా.వేణుమాధవ్, రఘు, డా.రాహుల్, డా.మీనాక్షి, సందీప్, సంగీత, అన్నపూర్ణ, శారద, అఖిల్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు సిద్ధమైన పీఎంశ్రీ పెద్దకొడప్ గల్ జట్టు



అక్షరటుడే, పెద్ద కొడప్ గల్ : కామారెడ్డి జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలలకు సంబంధించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు పెద్ద కొడప్‌గల్ పీఎం శ్రీ పాఠశాల కబడ్డీ జట్టు సిద్ధమైంది. ఈ నెల 30వ తేదీన (శుక్రవారం) కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. కమల ఆధ్వర్యంలో పాఠశాలలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి జట్టుకు ఎంపిక చేసినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యం తెలిపారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు, వారిని ఉన్నత స్థాయి పోటీలకు సిద్ధం చేయడమే లక్ష్యంగా క్రీడా కార్యక్రమాలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన కబడ్డీ క్రీడాకారులను ప్రధానోపాధ్యాయురాలు జి. కమలతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

నాన్‌వెజ్ వేస్టేజ్ టెండర్ రద్దు చేయాలి..

అక్షరటుడే, కామారెడ్డి: ఇటీవల కామారెడ్డి మున్సిపల్ పరిధిలో నాన్‌వెజ్ వేస్టేజ్ సేకరణ కోసం నిర్వహించిన టెండర్‌ను రద్దు చేసి తిరిగి టెండర్ నిర్వహించాలని కనకదుర్గ ఎంటర్ ప్రైజెస్ ప్రతినిధి రాకేష్ డిమాండ్ చేశారు. ఈనెల 8న మున్సిపల్ కమిషనర్, టెండర్ నిర్వాహకుల ఆధ్వర్యంలో కమిషనర్ కార్యాలయంలో నాన్‌వెజ్ వేస్టేజ్ టెండర్‌ను ఓపెన్ చేసి అత్యధిక బిడ్ దాఖలు చేసిన షా ఎంటర్ ప్రైజెస్‌కు ఏడాది పాటు టెండర్ అప్పగించారు. అయితే ఈ టెండర్ పారదర్శకంగా జరగలేదని, నిబంధనలు పాటించలేదని కనకదుర్గ ఎంటర్ ప్రైజెస్ ఆరోపిస్తోంది. గురువారం సదరు సంస్థకు చెందిన వ్యక్తి మున్సిపల్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఇతర జిల్లాల్లో ఇదే టెండర్ రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వెళ్తోందని, గతేడాది కామారెడ్డి మున్సిపాలిటీలోనే రూ.3.16 లక్షలకు టెండర్ దక్కిందని తెలిపారు. ఈ ఏడాది వచ్చిన తక్కువ బిడ్డింగ్‌తో ప్రభుత్వానికి లక్షల్లో నష్టం వస్తుందన్నారు. పత్రికలో ప్రకటన ఇచ్చి వారం రోజుల తర్వాత టెండర్ ఓపెన్ చేయాల్సి ఉండగా మూడు రోజులకే ఎలా ఓపెన్ చేస్తారని ప్రశ్నించారు.



అదానీ సిమెంట్‌తో క్షత్రియ కళాశాల ఒప్పందం

అక్షరటుడే, ఆర్మూర్ : విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించాలనే లక్ష్యంతో ఆర్మూర్ క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల ముందుకెళ్తోంది. ఈ క్రమంలో కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రముఖ సంస్థ అయిన అదానీ సిమెంట్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు పారిశ్రామిక సందర్శనలు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమల నిపుణులతో అతిథి ఉపన్యాసాలు, ప్రత్యక్ష ప్రాజెక్టులపై మార్గదర్శకత్వం వంటి అవకాశాలు లభించనున్నాయి. ఈ ఒప్పందం విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారి నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందని కళాశాల యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అల్లాపూర్ దేవేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారిని పారిశ్రామిక రంగానికి అవసరమైన నైపుణ్యాలతో తీర్చిదిద్దడమే కళాశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు.

